## క్లుప్తంగా

### మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లో ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, చిల్పూరు మండల కేంద్రంలో, జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి జీకి, వేలేరు మండలం మల్లికుదుర్లకు మూడు ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయా పనులు మంజూరు చేయడమే కాకుండా పనుల శంకుస్థాపన కార్యక్రమాలకు వస్తానని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

### జీపీ కార్యాలయాల సందర్శన



జనగామ రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజ్‌లో భాగంగా గానుగుపహడ్, పెద్దతండా(ఎం), అడవికేశావాపూర్‌లో కార్యదర్శి విధులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించేందుకు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జీపీ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామంలో చేపట్టిన పనుల వివరాలు కార్యదర్శి రోజువారి రిపోర్టులు తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం పెద్ద తండా (ఎం)లో నర్సరీ, పలు అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలు చేశారు. డీపీఓ రంగాచారి, ఎఫ్ఆర్ఓ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ హసీం, ఎంపీఓ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

### డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు అనూహ్య స్పందన



కొడకండ్ల: ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు అనూహ్య స్పందన లభిస్తుందని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దేశగాని సతీష్‌గౌడ్ తెలిపారు. 18 ఏళ్లు పైబడిన వారందరికి ఉచిత లైసెన్స్‌ల కార్యక్రమానికి పెద్ద ఎత్తున యువకులు అర్హులైన వారంతా వచ్చి దరఖాస్తులు చేసుకొంటున్నారని, ఇప్పటి వరకు 900 మంది మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకొన్నారని, ఇంకా మిగిలిపోయిన వారు ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. బండారి సోమన్న, నరేష్‌నాయక్, మేకల రమేష్‌యాదవ్, యాకన్న, కప్పల లింగయ్య, ప్రవీణ్, నీమా పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని పాంనూర్‌లో తన పట్టా భూమిలోని హద్దులుగా ఉన్న కనీలను అక్రమంగాతొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రైతు పల్లెపాటి సోమిరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రైతు సోమిరెడ్డి విలేకరులతో మాట్లాడారు.పాంనూర్‌లో సర్వే నంబర్ 179/బీ/1లో తనకు 3.35 ఎకరాల పట్టా భూమి ఉందన్నారు. అయితే సర్పంచ్ భర్త కోతి రాములు ప్రోద్బలంతో కొందరు రాజకీయ నాయకుల సహకారంతో తన భూమిలోకి పొన్న కొమురయ్య, పొన్న బీరయ్య, పొన్న చేరాలు అక్రమంగా ప్రవేశించి హద్దులుగా ఉన్న కనీలను తొలగించారన్నారు. తన భూమిలోని 12 గుంటలను అక్రమంగా దున్నారని, ఈ విషయమై వారిని అడుగగా చంపుతానని బెదిరిస్తున్నారని తెలిపారు. దౌర్జన్యంగా తన పట్టా భూమిని దున్నిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### రేషన్ డీలర్ మృతి

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపురం రేషన్ డీలర్ గడ్డం శ్రీశైలం శనివారం మృతి చెందాడు. కాగా, ఆయన మృతికి గ్రామస్తులు సంతాపం తెలిపి గ్రామానికి శ్రీశైలం చేసిన సేవలను కొనియాడారు.

### విద్యుదాఘాతంతో పాడిగేదె..

దేవరుప్పుల: మేతమేస్తూ విద్యుదాఘాతంతో పాడిగేదె మృత్యువాత పడిన సంఘటన శనివారం మండల కేంద్రంలోని కొత్తకాలనీలో చోటుచేసుకుంది. దేవరుప్పులలోని కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయం సమీపంలో వ్యవసాయ పనులకు వెళ్లిన ఉప్పల అంజయ్య అనే రైతు రోజువారీగా తన పాడిగేదెను మేతకు వదిలారు. మేస్తూ వెళ్లేక్రమంలో విద్యుత్ వైర్లుతాకి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు వాపోయాడు.



రఘునాథపల్లి: అరగుండు, అర మీసంతో నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు



లింగాలఘణపురం: భిక్షాటన చేస్తున్న పంచాయతీ సిబ్బంది



జఫర్‌గఢ్: కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

# జీపీ కార్మికుల వినూత్న నిరసన

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్మికులు తలపెట్టి నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా శనివారం 17వ రోజు భిక్షాటన, అరగుండు, అర మీసంతో, మోకాళ్లపై..ఒంటికాలిపై నిల్చొని వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. కార్మికుల సమ్మెకు పార్టీల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. పలు రకాలుగా కార్మికులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం విచారకరమని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



స్టేషన్‌ఘన్‌పూర్: మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు



దేవరుప్పుల: ఒంటికాలిపై నిల్చొని..



నర్మెటలో..

# దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



కోనాయిచలం వెళ్లే దారిలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ సుభాషిణి, ఎంపీపీ

జఫర్‌గఢ్: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ వి.సుభాషిణి క్షేత్ర స్థాయిలో శనివారం పరిశీలించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి తమ్మడపల్లి (ఐ)కి వెళ్లే రహదారిలో కల్వర్టు సమీపాన దెబ్బతిన్న రోడ్డును, సాగరం క్రాస్ రోడ్డు నుంచి కోనాయిచలంకు వెళ్లే రహదారి కల్వర్టు వద్ద కోతకు గురైన ఆర్డీఓ, ఎంపీపీ రడపాక సుదర్శన్‌తో కలసి పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలికంగా వెంటనే మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్ స్వప్న, సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### వైభవంగా తిరునక్షత్ర మహోత్సవం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమ్మవారికి అండాళ్ తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పంచామృత చందనాది హరిద్ర చూర్ణంతో అభిషేకం చేశారు. అనంతరం అర్చకుల వేద మంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి, జనగాం యాదగిరి-లక్ష్మి, ట్రాన్స్‌కో ఐఎన్‌టీయూసీ 327 జనరల్ సెక్రటరీ ఇనుగాల శ్రీధర్-సత్యవాణి దంపతులు, భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వరంగల్‌కు చెందిన పోలు అమర్‌చంద్-దివ్య అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

# విద్యార్థి చదువుకు సాయం

చిల్పూరు: ఉన్నత చదువులు చదివి డాక్టర్ కావాలనే ఆశ ఉన్నప్పటికీ తండ్రి మృతి చెందగా కూలిపనిచేసే తల్లికి చదివించే స్థోమత లేకపోవడంతో ఇక చదువు సాగదనుకున్న ఆమెకు దాతగా ముందుకు వచ్చి తోడ్పాటునందించారు చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు. మండలంలోని పల్లగుట్టకు చెందిన వంగపల్లి సారయ్య-పూలమ్మ కూతురు స్వాతి ఇంటర్ పూర్తికాగానే బిఎస్సీ కార్డియోవాస్కులర్ టెక్నాలజీ మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఫార్మసీలో చేరేందుకు సిద్ధమైంది. కాగా, ఫీజు కట్టే స్థోమత లేక ఆగిపోయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న శ్రీధర్‌రావు ముందుకు వచ్చి ఆమె 4 ఏళ్ల కోర్సు పూర్తయ్యేవరకు ఫీజు మొత్తం చెల్లిస్తానని చెప్పి శనివారం నగదును అందజేశారు.



విద్యార్థికి నగదు అందజేస్తున్న శ్రీధర్‌రావు

విద్య ద్వారా పేదలను శక్తివంతులుగా చేసేందుకు ముందుకు వచ్చిన శ్రీధర్‌రావుకు సర్పంచ్ బొట్టు మానస, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, వేల్పుల గట్టయ్య, డాక్టర్ చిర్ర సుమన్, డాక్టర్ జీడి రమేష్, బొట్టు చేరాలు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

### రక్తదానం పౌరుల బాధ్యత



రక్తదానం చేస్తున్న ప్రతినిధులు

జనగామ రూరల్: రక్త దానం సేవ మాత్రమే కాదు.. ప్రతి పౌరుని బాధ్యతగా భావించాలని రెడ్ క్రాస్ పూర్వ రీజియన్ చైర్మన్ ఏనుగు నర్సిరెడ్డి అన్నారు. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో లయన్ కామిని శ్రీనివాస్‌బాబు నేతృత్వాన శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రాణాలను నిలబెట్టే మహత్తర కార్యాక్రమం రక్తదానమని, సమయానికి రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజు, నర్సింహులు, శ్రీరామ్, నాగరాజు, పూర్ణచందర్, సుమన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ వార్డు కమిటీల ఎన్నిక



కమిటీలకు నియామక పత్రాలు అందజేస్తున్న సమ్మయ్య

జనగామ: జనగామ పట్టణంలోని 13, 14, 15వ వార్డుల్లో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లి సమ్మయ్య అధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగింది. 13వ వార్డు అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.యాదగిరి, 14వ వార్డు అధ్యక్షుడిగా వలబోజు సురేందర్, ప్రధాన కార్యదర్శిగా మెట్ల రాజు, 15వ వార్డు అధ్యక్షుడిగా జంగిటి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా ఉల్లెంగుల శ్రీనును ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ఏల్లేష్, బైరు బాబు, ఎండీ ఇక్బాల్, సీస శ్రీధర్, ఎండీ ఖలీల్, ఎండి సిరాజ్, బండపల్లి సోమేష్ గౌడ్, బాల్నె రమేష్, సుద్దాల సురేష్, ఉల్లెంగుల్ల అన్వేష్ కుమార్, గుండె సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పింఛన్‌ను విడుదల చేయాలి

జనగామ రూరల్: దివ్యాంగులకు పింఛన్ రూ.1,000 పెంచిన జీఓను వెంటనే విడుదల చేయాలని ఎన్పీఆర్డీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ల గణేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు పాముకుంట చందు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పింఛన్ పెంచుతూ ప్రకటించి 45 రోజులు కావస్తున్నా అమలు చేయకపోవడం దివ్యాంగులను మోసం చేయడమే అని అన్నారు.



మాట్లాడుతున్న గణేష్

కార్యక్రమంలో తోట సురేందర్, కొత్తపల్లి రమేష్, కుమార్, శ్రీదేవి, రాజు, మధు, వెంకటమ్మ, రమాదేవి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సంక్షిప్త సమాచారం

### కొనసాగుతున్న స్వీపర్ల సమ్మె

జనగామ రూరల్: కనీస వేతన అమలు చేయాలని జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగుతోంది. సమ్మె శనివారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంజయ్య మాట్లాడుతూ స్వీపర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి టైమ్‌స్కేల్ వర్తింపజేసి కనీస వేతనం రూ. 27 వేలు ఇవ్వాలని, పెన్షన్‌తో పాటు రిటైర్మెంట్ సమయంలో రూ.15 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. భాస్కర్, అమోద్య, మల్లేషం, లాలు, రాములు, యాదయ్య పాల్గొన్నారు.

### చెత్త సేకరణలో సర్పంచ్

జనగామ రూరల్: జీపీ కార్మికుల సమ్మె చేస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్యం లోపించకుండా ఎర్రగోల్ల పహడ్ సర్పంచ్ వంగాల రేణుక భర్త శంకర్ శనివా రం ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి చెత్త సేకరణ చేట్టా రు. వ్యాధులు ప్రబల కుండా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రతీ ఒక్కరు చూసుకోవాలని కోరారు.

### ఆర్థికసాయం

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులకు చెందిన గొలనకొండ సోమక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చారబుడ్ల ఆగారెడ్డి, ఎంపీటీసీ నర్సయ్య శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

### జీపీ కార్మికుడి కుటుంబానికి..

దేవరుప్పుల: మండలంలోని గొల్లపల్లిలో 30 ఏళ్లుగా జీపీ కార్మికుడిగా విస్తృత సేవలందించి అకాల మృతి చెందిన బొండ్ల ముత్తయ్య కుటుంబానికి సర్పంచ్ కోనేటి సుభాషిణి రూ.39,600 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికుడిగా పనిచేసిన ముత్తయ్య కుటుంబ దీనస్థితిపట్ల స్పందించిన గ్రామస్తులు విరాళాల ద్వారా తోడ్పాటు అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ ఆకవరం నర్సింహ్మారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు తీగల సత్యనారాయణ, కోనేటి నర్సయ్య పాల్గొన్నారు.

# ఇంకుడుగుంతలు నిర్మించాలి

బచ్చన్నపేట: అన్ని గ్రామాల్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన నూతనంగా నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంబంధించిన నీరు ఆరు బయటకు రాకుండా చూడాలన్నారు. ఇంకుడు గుంత నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రఘురామకృష్ణ ఉన్నారు.

**భూమిపూజ**

లింగాలఘణపురం: మండల కేంద్రంలో జనగామ రోడ్డువైపు సామూహిక ఇంకుడు గుంత నిర్మాణానికి శనివారం సర్పంచ్ విజయ్‌మనోహర్, ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఎంపీడీఓ సురేందర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్ ఉన్నారు.



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న డీఆర్డీఓ రాంరెడ్డి

# దళితులపై నిర్లక్ష్యం తగదు

దేవరుప్పుల: నిలువ నీడలేని దళితులపై బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని మాదాపురంలో దళితులకు డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాల పేరిట నిలువ నీడ కోల్పోయిన 20 మంది బాధితులకు టార్పాలిన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలల కిందట 30 మంది దళితులకు డబుల్‌బెడ్రూంలు నిర్మిస్తామని మంత్రి దయాకర్‌రావు శంకుస్థాపన చేసి పనులు చేపట్టి పునాదుల స్థాయిలో ఎత్తివేయడం సరికాదన్నారు. అధికారుల యంత్రాంగం పర్యవేక్షణ లోపంతో సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ప్రస్తుత వర్షాలకు నిలువనీడ కోల్పోయిన దళితుల సమస్యపై ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో డబుల్‌బెడ్రూంల తతంగంపై బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి పేదలకు న్యాయం చేకూర్చేందుకు తోడ్పాటు అందజేస్తామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు భాగాల నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త సత్తి రెడ్డి, రాజోజు నరసింహ చారీ, శ్రీకాంత్, శోభన్, సోమయ్య, అభిషేక్, దినాకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.



టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

# బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్

స్టేషన్‌ఘన్‌పూర్: నూతన ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు తదితర అంశాలపై బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని ఇన్‌చార్జ్ ఆర్డీఓ సుహాసిని, తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఎల్‌ఓలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నికల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొత్త ఓటర్ల చేర్పులు, మరణించిన, గ్రామం నుంచి వెళ్లిపోయిన వారి ఓటర్ల తొలగింపు, ఓటర్ల జాబితాలో సవరణలు, పోలింగ్ కేంద్రాల్లో సాధారణ సదుపాయాల నిర్వహణ, బీఎల్‌ఓల మొబైల్ సాఫ్ట్‌వేర్ తదితర అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ రాజేందర్, ఆర్‌ఐ అర్జున్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# ఘనంగా దాశరథి జయంతి వేడుకలు

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరథి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.కాళహస్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దాశరథి అంటే పీడిత ప్రజల గొంతుక అని, నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని తన కవితాస్త్రాలతో మేల్కొలిపారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఆనందరావు, సారంగపాణి, వేణుమాధవ్, తిరుపతి, ప్రియదరిని, ఉమారాణి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కాళహస్తి, అధ్యాపకులు

### జ్వరాలతో జాగ్రత్త



చిల్పూరు: జ్వరాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మల్కాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ బాణాల రాజమౌళి అన్నారు. మండలంలోని కృష్ణాజీగూడెంలో శనివారం ఇంటిటా జ్వరాలపై సిబ్బందితో కలసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గామాల్లో ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ఏఎన్‌ఎంలకు తెలుపాలి తప్ప సొంత వైద్యం చేసుకోవద్దని సూచించారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గు లాంటివి ఉన్నాయని, అలాంటి వారిని గుర్తించి మందులు పంపిణీ చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీని కలిసిన మహిళా సంఘాల సభ్యులు



స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండకు చెందిన మహిళా సంఘాల సభ్యులు సర్పంచ్ ధ్యాగల ఉప్పలస్వామి, ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలో అతని నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నమిలిగొండలో మహిళా కమ్యూనిటీ భవన నిర్మాణానికి సహకరించాలని వారు ఎమ్మెల్సీని కోరగా ఆయన సానుకూలంగా స్పందించి తన నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# దోషులను బహిరంగంగా ఉరితీయాలి

జఫర్‌గఢ్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి, ఒకరిపై అత్యాచారానికి పాల్పడిన దోషులను వెంటనే బహిరంగంగా ఉరితీయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి షబానా, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మణిపూర్ రాష్ట్ర సీఎం దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘటనకు బాధ్యత వహిస్తూ మణిపూర్ సీఎం వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలనలో మణిపూర్ రాష్ట్రంలో హింస జరుగుతన్నా ప్రధాని నరేంద్రమోదీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అల్లర్లకు బాధ్యులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించి, తక్షణమే ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పక తప్పదని వారు హెచ్చరించారు. పార్టీ నాయకులు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, నల్లతీగల శ్రీనివాస్, వడ్లకొండ రాజు, తాటికాయల రేనా, కాట భాస్కర్, కాట శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి: నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులు

**రాస్తారోకో..**

పాలకుర్తి: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన అకృత్యాలకు బాధ్యులైన దోషులను శిక్షించాలని ప్రతి పక్షాలు, ప్రజాసంఘాలు పాలకుర్తిలో శనివారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ మేరకు అక్కడి ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడిరాజుల సాంబయ్య, చక్రాల రఘు, రమేష్‌రాజా, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మాచర్ల పాపయ్య, అనంతోజు రజిత, పడమటింటి భాస్కర్, బొట్టు శ్రీధర్, మాన్యపు భుజేందర్, కారుపోతుల శ్రీనివాస్, చిట్యాల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

**మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలి**

పాలకుర్తి టౌన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళను నగ్నంగా హింసించిన నేపథ్యంలో అక్కడి ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగె సందీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పాలకుర్తిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దోషుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

### ఎస్సై బాధ్యతల స్వీకరణ



కొడకండ్ల: కొడకండ్ల ఎస్సైగా నియామకమైన బండి శ్రవణ్‌కుమార్ శనివా రం విధుల్లో చేరి బాధ్య తలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా విధులు నిర్వర్తించిన కొమురెల్లి ఇంతేజార్‌గంజ్ పీఎస్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో శ్రవణ్‌కుమార్ నియామకమైనాడు. బదిలీ అయిన ఎస్సై కొమురెల్లికి వీడ్కోలు పలికి నూతనంగా వచ్చిన ఎస్సై శ్రవణ్‌కుమార్‌ను బీఆర్ఎస్ యువజన నాయకులు కలసి సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై కోరారు.

# జీపీ కార్మికులకు రూ.20వేల అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 17 రోజులుగా జీపీ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుండగా ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి తనవంతుగా మండలంలోని జీపీ కార్మికులకు ఒక్క రోజు వంటవార్పు కోసం రూ.20వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ మేరకు కార్మిక సంఘం మండల నాయకులు కందాలోజు రాజు, రావుల జగన్నాధం, కుంభం రాజు ..వైస్ ఎంపీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం**

తాటికొండలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పంజా భిక్షపతి, కొంధ్ర యాదమ్మ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.10వేలు ఆర్థికసాయం వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవ్వరూ మృతిచెందినా తనవంతుగా బాధిత కుటుంబానికి రూ.5వేలు అందిస్తున్నట్లు తెలిపారు.



నాయకులతో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి